మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# పంటలు ఎందుకు ఎండుతున్నాయి..

- రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న కలెక్టర్
- కోయిల్ కొండ మండలంలో వరి పంట పరిశీలన
- కెజిబి, నర్సరీ తనిఖీ



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి11, ప్రభాతవార్త:** కోయిల్ కొండ మండలం ఆయా ప్రాంతాలలో ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వరి క్షేత్రాలను కలెక్టర్ విజయేంద్ర బోయి మంగళవారం పరిశీలించారు. బోరు బావుల కింద సాగవుతున్న వరి పైరు ఏ స్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉంది అన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. కోయిల్ కొండ మండలం శేరి వెంకటా పూర్ గ్రామంలో శ్రీధర్ రెడ్డి, సంగనోని పల్లి గ్రామంలో టి.నరేందర్ రెడ్డి అనే రైతులకు చెందిన వరి పైర్లు భూగర్భ జలాలు ఇంకి పోయి బోరులో నీరు సరిపడినంత లేక పాక్షికంగా విస్తీర్ణంలో ఎండుముఖం పట్టడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాల గురించి వ్యవసాయ అధికారులను, సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శేరి వెంకటాపూర్‌లో శ్రీధర్‌రెడ్డి రైతు పొలం రెండు ఎకరాల విస్తీర్ణంలో బోరులో నీరు సరిపడినంత లేక వరి పైరు ఎండి పోవడం జరిగింది. గత యాసంగిలో సాగు చేశారా లేదా తెలుసుకున్నారు. గత సీజన్‌లో సాగు చేయలేదని రైతు శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ సీజన్‌లో వర్షాలు పడి నీళ్ళు ఉంటాయని పంట వేసినట్లు తెలిపారు. సంగనోని పల్లిలో నరేందర్‌రెడ్డి రైతు ఒకటిన్నర ఎకరంలో వరి సాగు చేయగా పాక్షికంగా ఎండి పోవడం జరిగింది. బోరు లో తక్కువగా నీరురావడంతో ఎండిపోవడం జరిగిందని తెలిపారు. కేవలం బోరు బావుల పైనే ఆధారపడి పంటలు వేసిన తరుణంలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయి 15 రోజుల ముందు వరి పంటకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పైమండలాలలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. ఎంత విస్తీర్ణంలో పంటఎండిపోయే దశకు చేరింది. మిగితా విస్తీర్ణంలో వరి పంట దిగుబడులు చేతికి వచ్చేందుకు ఇంకా ఎంత సమయం పడుతుంది, ఎన్ని తడులు నీరు అవసరం అవుతుంది, గతేడాది యాసంగిలో పంటల పరిస్థితి ఎలా ఉండింది, ఏ రకం ధాన్యం సాగు చేస్తున్నారు తదితర వివరాలను కలెక్టర్ ఆరాతీశారు. ఎండుముఖం పడుతున్న పంటలకు సాగు అందించేందుకు వీలుగా ఏవైనా ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉంటే పరిశీలించాలని అధికారులకు సూచించారు. కాగా, సాగునీటి విషయమై రైతుల్లోఅవగాహన పెంపొందించాలని కలెక్టర్‌వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కనీసం వచ్చే యాసంగి సీజన్లో నైనా సాగునీరు వనరుల లభ్యతను బట్టి తగిన పంటలు వేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా బోరుబావులపైనే ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులకు భూగర్భ జలాల పరిస్థితి గురించి వివరిస్తూ, రబీలో పూర్తి విస్తీర్ణంలో వరి పంట వేయకుండా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చూడాలని, క్షేత్రస్థాయిలో రైతులకుఅందుబాటులోఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జమలాపూర్‌లో నర్సరీని సందర్శించారు. వచ్చే వానాకాలం లో రోడ్ సైడ్ అవెన్యూ ప్లాంటేషన్, హోంస్టెడ్ ప్లాంటేషన్‌కు కావలసిన మొక్కలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్‌కు సంబంధిత అధికారులు వివరించారు. కోయిల్ కొండ కెజిబివిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కెజిబివిలో సౌకర్యాలు -మిగతా4లో..



రోబో టెక్నాలజీతో కూడిన పరికరాన్ని టన్నెల్లోకి తీసుకెళ్తున్న దృశ్యం

# ఇక రంగంలోకి రోబోలు

- రోబో టెక్నాలజీతో సహాయక చర్యలు
- ముమ్మరంగా రెస్క్యూ ఆపరేషన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 11 ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బిసి సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోబోల సాయంతో రెస్క్యూ ఆపరేషన్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలని బృందాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రోబో టెక్నాలజీ సహాయంతో సహాయక చర్యలు కొనసాగించారు. డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మంగళవారం ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ ఆఫీసులో సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. టన్నెల్ సహాయక చర్యలలో అనుసరించాల్సిన విధి విధానాలు, రోబోటిక్స్, మెకానికల్ పరికరాల వినియోగం, మట్టి తొలగింపు ప్రక్రియ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించిన అధికారులు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడానికి తీసుకోవాలని అధికారులకు అవసరమైన అన్ని చర్యలు వివరించారు. ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలలో రోబోలను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మంగళవారం ఉదయం హైద్రాబాద్‌కు చెందిన అన్వి రోబోటిక్స్ సంస్థకు చెందిన ఎఐ బేస్డ్ కెమెరా సదుపాయం గల రోబోటిక్‌ను సంస్థ ప్రతినిధులు విజయ్, అక్షయ్‌లు లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్ళారు. అన్వి రోబోటిక్ సంస్థకు చెందిన ప్రతినిధులు దగ్గర ఆఫీసులో కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లను ప్రారంభించినట్లు వివరించారు. ప్రమాద ప్రదేశంలో చేపట్టే సహాయక చర్యల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండ రోబోల సహాయక చర్యలు ఉపయోగించుకుంటున్నట్లు వివరించారు. సహాయక చర్యల్లో కావలసిన సామాగ్రితో పాటు సహాయక బృందాలు మరోమారు కడవర్ డాగ్స్ ప్రమాద ప్రదేశానికి వెళ్లాయని తెలిపారు. ఈ సమావేశంలో, జీయోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అన్వి రోబోటిక్స్, హైడ్రా అధికారులు, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే, కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్ సహా సహాయక చర్యల్లో పాల్గొంటున్న అన్ని బృందాల అధికారులు హాజరయ్యారు.



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్





సహాయక చర్యల్లో రెస్క్యూ బృందాలు

# వాల్మీకిల చిరకాల వాంఛను నెరవేర్చండి

- ఎస్టీ జాబితాలో చేర్చండి
- లోకసభలో కేంద్ర ప్రభుత్వాన్ని గిరిజన శాఖ మంత్రిని కోరిన ఎంపీ డికె.అరుణ
- రెండో విడత బడ్జెట్ సమావేశాల జీరో అవర్‌లో ప్రసంగం
- తెలుగు ప్రసంగంతో అందరి దృష్టిని ఆకర్షించిన ఎంపి
- పార్లమెంట్‌లో తెలుగులో మాట్లాడి అందరి దృష్టిని ఆకర్షించిన ఎంపీ డికె అరుణ



లోక సభలో ప్రసంగిస్తున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో మార్చి 11 ప్రభాతవార్త:** ఎపి, తెలంగాణలోని బోయ వాల్మీకి బోయ వాల్మీకిలు నేటికీ ఆర్థికంగా, విద్యా పరంగా, సామాజికంగా చాలా వెనకబడి ఉన్నారని వారి చిరకాల డిమాండ్‌ను నెరవేర్చాలని ఎంపీ డికెఅరుణ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం జరిగిన లోక్ సభ సమావేశంలో ఆమె ప్రసంగించారు. పూర్వం బోయ వాల్మికులు జీవనోపాధి కోసం వేటకు వెళ్ళేవారని, వారికి ఎలాంటి కులవృత్తి లేక ఎవరు పట్టించుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బోయ వాల్మీకిలు పక్కనున్న కర్ణాటకతో పాటు అనేక రాష్ట్రాల్లో ఎస్సీలు, ఎస్టీలుగా గుర్తింపు పొందుతున్నారని, కానీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని బోయ వాల్మీకిలు ఇంకా వెనకబడిన తరగతులుగానే కొనసాగుతున్నారని వివరించారు. తెలంగాణ మొత్తం కలిసి 5లక్షల మందికి పైగా బోయ వాల్మీకి సామాజికవర్గ ప్రజలు ఉన్నారని, ముఖ్యంగా తమ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే బోయ వాల్మీకిలు ఎక్కువగా ఉన్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. బోయ వాల్మీకి లను ఎస్టీ జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనలను గుర్తించి అప్పట్లో తెలంగాణ ప్రభుత్వం చెల్లప్ప కమిటీ నీ వేసిందని, కమిటీ సిఫారసులను తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రామాయణం రాసిన వాల్మీకి మహర్షి వారసులుగా ఉన్న వీరందరికీ న్యాయం చేయాలని కోరారు.

## ఏకకాలంలో రెండు లక్షల..

# రుణమాఫీ చేశాం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఎస్సీ సబ్ ప్లాన్ కింద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 11 ప్రభాతవార్త:** ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని మాచన్‌పల్లి గ్రామంలో రూ.40లక్షలతో, రామచంద్రపూర్ గ్రామంలో రూ.35లక్షలతో, బొక్కలోనిపల్లి గ్రామంలో రూ. 35 లక్షలతో చౌదర్‌పల్లిలో 10 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మాచన్ పల్లి గ్రామంలో రూ.20 లక్షల నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందించాలనే కృతనిశ్చ యంతో ఉందని ఆయన స్పష్టం చేసారు. అందుకే భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం అని ఆయన చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ ఎస్టీ బీసీ, ఆర్థికంగావెనుకబడిన వారి పిల్లలు మాత్రమే చదువుకుంటారని, వారు చదువుతున్న పాఠశాలలు అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులు వేసిన పంటలు ఏ కారణం చేతా ఎండిపోరాదని, ఎలాంటి విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నుంచి 100 ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేయించడం జరిగిందని ఆయన తెలిపారు.

# కచ్చా లే అవుట్ ప్లాట్‌లను కొనుగోలు చేయవద్దు

- మార్చి 31 వరకు 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్
- కచ్చా లే అవుట్లు, ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్లపై చర్యలు
- మున్సిపల్ కమిషనర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, మార్చి11 ప్రభాతవార్త:** 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్నవారు జిల్లాలో 29 వేల మంది ఎల్‌ఆర్‌ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, వారి నుండి డబ్బులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ లే అవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పై మంగళవారం ఉదయం కలెక్టరేట్‌కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్లు, లైసెన్స్ టౌన్ ప్లానర్‌లు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ ఎల్‌ఆర్ఎస్ పురోగతి పై సమీక్ష నిర్వహించారు. కచ్చా లే అవుట్ ప్లాట్‌లను కొనుగోలు చేయవద్దని అన్నారు. కచ్చా లేఅవుట్లు, ఎల్‌ఆర్‌ఎస్ లేనిప్లాట్లపై చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిష నర్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల ద్వారా దాదాపు 25 వేల మందికి నోటీసులు జారీ చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో క్రమబద్ధీకరణ జరగటం లేదని ప్రశ్నించారు. లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్‌లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారితో వార్డు ఆఫీసర్ల ద్వారా ఫోన్ చేయించిడబ్బులు కట్టించే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్‌ఆర్‌ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూపై ప్రో రేటా ఫీజు తో పాటు14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని అదేవిధంగా లే అవుట్లు, ప్లాట్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31 నాటికి కచ్చా లే అవుట్‌లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికిని చివరి నిమిషంలో సర్వర్ పని చేయకుంటే లబ్ధిదారులు నష్టపోతారని అందువల్ల వెంటనే డబ్బులు కట్టి క్రమబద్ధీకరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని -మిగతా4లో..



ఎల్‌ఆర్‌ఎస్ పురోగతిపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# ఇందిరమ్మ ఇళ్లు అత్యంత నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

- గద్వాల కలెక్టర్ బి.యం.సంతోష్

**గద్వాల, మార్చి 11 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్లను అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో నిర్మించేందుకు మేస్త్రీలు శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకుని తమ నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సూచించారు. మంగళవారం పాత కలెక్టర్ కార్యాలయం వెనక నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ తో కలిసి నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, మేస్త్రీలకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను అత్యుత్తమ నాణ్యతతో నిర్మించేందుకు, ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షల నిధులతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు మేస్త్రీలకు శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఇల్లు కట్టడంలో మేస్త్రీల ప్రాముఖ్యత చాలా ముఖ్యమని సూచించారు. తక్కువ ఖర్చుతో, ఉత్తమ నాణ్యతతో ఇళ్లు నిర్మించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, ప్రతి మేస్త్రీ శిక్షణలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం ఈ ఆరు రోజుల శిక్షణలో పాల్గొనే ప్రతి మేస్త్రీకి రోజుకు రూ.300 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణ ద్వారా కొత్త నిర్మాణ పద్ధతులు, మెరుగైన సామగ్రి వినియోగం, భద్రతా ప్రమాణాలు వంటి కీలక అంశాలపై -మిగతా4లో..



మేస్త్రీలకు కిట్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ సంతోష్

# నాగుపాముకు చికిత్స

**జడ్చర్ల, మార్చి 11 ప్రభాతవార్త:** జడ్చర్ల మండలం అల్వాన్ పల్లి గ్రామంలో నాగుపామును గుర్తించిన యువకులు సర్పరక్షకుడు డా.సదాశివయ్యకు సమాచారం అందించారు. వెంటనే ఆయన శిష్యులు రాహుల్, రవీందర్ లు అక్కడికి చేరుకునేలోపు పాము రంధ్రంలోకి వెళ్లిపోయింది. ఆ రంధ్రాన్ని గ్రామస్థులు తవ్వుతుండగా గడ్డపార పాము యొక్క నడుములో దిగబడింది. గాయంతో ఉన్న పాము చాలా కోపంగా బయటకి రావడంతో గ్రామస్థులు పారిపోయారు. ఆ పామును రాహుల్, రవీందర్‌లు చాకచక్యంగా పట్టుకుని డా. బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జీవవైవిధ్య సంరక్షణ విద్యాకేంద్రంకు తరలించారు. అక్కడ డా. సదాశివయ్య చికిత్స చేసి కట్టుగట్టి సురక్షితంగా కాపాడుతున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో పాములను రక్షించిన డా. సదాశివయ్య బృందాన్ని గ్రామస్థులు అభినందించారు.



నాగుపాముకు చికిత్స చేస్తున్న దృశ్యం

# ముకురాల గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు

**మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే**

**కల్వకుర్తి, మార్చి 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని ముకురాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, భార్య కవిత, కూమార్తె శ్రీత, కూమరుడు విశ్వాన్‌లు హైదరాబాద్‌లోనిహబ్సిగూడాలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడు చంద్రశేఖర్‌రెడ్డి, భార్య కవితలు ముందుగా ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి వారు ఇరువురు ఫ్యాన్‌లకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనతో ముకురాల గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. మంగళవారం మృతదేహాలను స్వగ్రామానికి తీసుకొని రావడంతో ఊరంతా మృతుడు నివాసం వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటన విషయం తెలుసుకొని ప్రతి ఒక్కరు కంట తడి పెట్టారు. బలవన్మరణం చేసుకున్న చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులను ముకురాల గ్రామంలో వారి ఇంటి వద్ద ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మృతదేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘటన విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయన వెంట నాయకులు అశోక్ రెడ్డి, ఆనంద్ కుమార్, స్థానికులు నర్సిరెడ్డి పలువురు నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

## నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

■వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 11 ప్రభాతవార్త :** జిల్లాలో ప్రభుత్వం ద్వారా జరుగుతున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా పరిషత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించారు. సి.సి. రోడ్లు, పంచాయతీ కార్యాలయ భవనాలు, పాఠశాలల నిర్మాణం, మరమ్మతులు, అంగన్వాడి భవనాల్లో మౌలిక సదుపాయాలు తదితర పనుల పురోగతి పై పంచాయతీరాజ్ ,ఈడబ్లుఐడిసి ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. వచ్చిన నిధులను ఆర్థిక సంవత్సరం పూర్తి అయ్యేలోగా ఖర్చు చేయాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయడమే కాకుండా చేసిన పనులకు యంబిలు పూర్తి చేసి సమర్పించాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు కనీసం రూ. 1516 కోట్ల పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించారు. అనంతరంపియంశ్రీ నిధులతో జిల్లాలోనికేజీబివి, సంక్షేమ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులపై సమీక్ష నిర్వహించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, పిడి ఆర్డీఓ ఉమాదేవి,పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు మల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, విద్యా శాఖ అధికారి సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడం అభినందనీయం

■మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి


**మక్తల్, మార్చి 11 ప్రభాతవార్త:** మారుమూల గ్రామాల్లోని పేద ప్రజలకు సేవ చేయడం అభినందనీయమని, సామాజిక సేవ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. వాకిటి శ్రీహరి సేవా సమితి, కందూర్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మక్తల్ మండలంలోని గడ్డంపల్లి లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల పల్లెల్లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 135 మంది కంటి వైద్య శిబిరానికి హాజరు కాగా, వారికి కంటి పరీక్షలను నిర్వహించారు. వీరిలో 75 మంది కంటి పొరల సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాజీ సర్పంచ్ గడ్డం రమేష్, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, సత్యం గౌడ్, పంచాయతీ కార్యదర్శి లింగప్ప, నాయకులు రామాంజనేయులు, శివారెడ్డి, నాగరాజు, నరేందర్, పరుశురాం, కొండప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి వట్టెం వార్షిక బ్రహ్మోత్సవాలు

◆ ముస్తాబైన వెంకటేశ్వర స్వామి ఆలయం ◆ 15న వెంకన్న కళ్యాణోత్సవం



వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం



ప్రధాన ఆలయంలోని ఉత్సవమూర్తులు

**బిజినేపల్లి, మార్చి 11 ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్ష దైవం వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. వట్టెం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ ప్రాంతంలోనే ప్రసిద్ధి చెందినవి. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు అయిదు రోజులపాటు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవ కార్యక్రమాలు 12న అలంకారం, రాజ భోగ నివేదన అర్చన, సేవా కాలం, నివేదన, హోమం, అంకురార్పణ 13న తిరుచ్చి సేవా, సంతానార్తులకి గరుడ ప్రసాద వితరణ, శేష వాహన సేవ, 14న ఎదుర్కోళ్ల ఉత్సవంహనుమన్ వాహన సేవ, 15న శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణం, గరుడ వాహన సేవ, 16న కల్పవృక్ష వాహన సేవ, 17న మహా పూర్ణాహుతి, పల్లకిసేవ ఉత్సవాల ముగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సందడి నరేందర్ రెడ్డి తెలిపారు.

## మామిళ్ల పల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు

**ఉప్పునుంతల, మార్చి11 ప్రభాతవార్త:** మండలంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొత్త హుండీలు దాతలు అందించడంతో పాత హుండీల స్థానంలో కొత్త హుండీలను ఏర్పాటు చేశారు. పాత హుండీ లెక్కింపు చైర్మన్ వేముల నరసింహారావు, కార్యనిర్వాహాధికారి నరసింహులు, పాలకమండలి ఆధ్వర్యంలో పాత హుండీ లెక్కింపు చేపట్టారు. పాత హుండీ లెక్కింపు చేపట్టగా రూ. 45 వేల 765 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహులు ప్రకటించారు. ఈ లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఈఓ నరసింహులు, హుండీ దాతలు ఎలుక స్వరూప సుదర్శన్ రెడ్డి, కీ॥శే॥ బాలకృష్ణ జంగయ్య మనుమండ్లు మామిళ్ళపల్లి,పాలకమండలి సభ్యులు చలమల గణేష్ గౌడ్, ఎలుక స్వరూప సుదర్శన్‌రెడ్డి, కన్నోజు ప్రదీప్ ప్రసాద్, బుధగం శ్రీనివాస్ గౌడ్, చెవ్వ కృష్ణయ్య, ఆలయం సిబ్బంది నాగరాజులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహ స్వామికి భారీగా వెండి వస్తువులు వితరణ

**ఉప్పునుంతల, మార్చి11 ప్రభాతవార్త:** మండలంలోని అయ్యావారిపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి శ్రీ చాగంటి రఘునాథ్, రజినీ వెండి తోరణం వితరణ చేశారు. అదేవిధంగా అయ్యావారిపల్లి గ్రామానికి చెందిన ధ్యాప సునీత, శ్రీధర్‌రెడ్డిలు వెండి పంచపాలినీ స్వామివారికి సమర్పించారు. వారితోపాటు నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి సతీమణి మంజుల స్వామి వారికి వెండి గణపతి కవచం, కంది కొండ ,కల్పన, రాజశేఖర్‌లు వెండి కలశం పూజారి చేతుల మీదుగా స్వామివారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు చెన్‌రెడ్డి యాదవ రెడ్డి, ఊర్మిళ, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్‌రెడ్డితో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఇరువురు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## జ్ఞాన సమాజాన్ని నిర్మించడమే భీమ్ దీక్ష ఉద్దేశం

**లింగాల, మార్చి11 ప్రభాతవార్త:** జ్ఞాన సమాజాన్ని నిర్మించడమే భీమ్ దీక్ష ఉద్దేశమని జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకల శివశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏకలవ్య చౌరస్తాలో స్వేరోస్ భీమ్ దీక్ష కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకల శివశంకర్ మాట్లాడుతూ నవ సమాజాన్ని నిర్మించడమే స్వేరోస్ ప్రధాన లక్ష్యమన్నారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికమనే మూడు అంశాలపై భీమ్ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని నెలకొండపల్లలో ఈ నెల 15 తేదిన జరిగే ప్రారంభ భీమ్ దీక్ష సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ మండల నాయకులు గట్టు రాజీవ, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీ సంపత్ కుమార్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు పాదాల రాము,జగదాబ్బి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నవాబుపేట, మార్చి 11 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనంపై పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా అదుపుతప్పి ద్విచక్ర వాహనం పై నుండి పడి తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ మండల పరిధిలోని ఫతేపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ చారి తండ్రి బ్రహ్మయ్య (40) వృత్తిపరంగా కార్పెంటర్ పని చేసుకొనొ మహబూబ్‌నగర్ నుండి తిరిగివస్తూ మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామ శివారులో అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై నుండి పడి గాయాల పాలయ్యాడు. అనంతరం బంధువుల సహాయంతో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో మృతి చెందాడని తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ధ్యానం, యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

■ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజర్ గద్దె ఆంజనేయులు

**నారాయణపేట టౌన్, మార్చి 11 ప్రభాతవార్త :** ధ్యానం, యోగాను దైనందిక జీవితంలో భాగం చేసుకోవాలని ఆర్ట్ ఆఫ్ లీవింగ్ ఆర్గనైజర్ గద్దె అంజనేయులు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులకు ప్రత్యేకంగా రెండు రోజులుగా ధ్యానం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆర్గనైజర్ గద్దె ఆంజనేయులు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీగా ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది నిత్యం ధ్యానం, యోగా సాధనతో తమ ఆరోగ్యం పై పట్టు సాధించవచ్చు అన్నారు. ధ్యానం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ప్రశాంతత లభిస్తుందని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వర్తించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎస్సైలు రాజు, నరసింహ జిల్లా ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

■వనపర్తి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, మార్చి 11 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద నాట్కో ఫార్మా ట్రస్ట్ వారి సహకారంతో టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ రాజేశం, నాట్కో ఫార్మా ట్రస్ట్ సి ఎస్ ఆర్ హెడ్ మదన్, టీబీ కన్సల్టెంట్ గణ జిల్లా కలెక్టర్‌తో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాను టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలో టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు మొబైల్ ఎక్స్రే మిషన్ ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని, దాదాపు 90 రోజుల నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుండగా, ఈ స్క్రీనింగ్ లో 721 మందికి టీబీ గుర్తించినట్లు చెప్పారు. ఈ స్క్రీనింగ్ ప్రక్రియనిర్వహణలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకంగానిలుస్తుందని చెప్పారు. క్షయ రోగులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోగము వచ్చినవారు ఆందోళన పడవలసిన పనిలేదని, ఆరు నెలలు క్రమం తప్పకుండా సరైన పోషకాహారము, వైద్యులు సూచించిన మందులు తీసుకున్నట్లయితే నయమవుతుందని చెప్పారు. పొగ త్రాగడం మద్యం సేవించడం వంటివి మానుకోవాలని సూచించారు. తగు జాగ్రత్తలు అన్నీ క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు పాటిస్తే తప్పనిసరిగా ఈ జబ్బు నయమవుతుందని చెప్పారు. ఈ జబ్బు సోకినవారు జాగ్రత్తలు తీసుకోకుండా ఉంటే ఇంట్లో వారికి కూడా సోకే ప్రమాదం ఉంటుందని కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జెడిరాజేశం, నాట్కోసి ఎస్ఆర్‌హెడ్ మదన్‌లు మాట్లాడుతూ నాట్కో వారి సహకారంతో ప్రతి నెల రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందజేయడం జరుగుతుందని, జాగ్రత్తలు పాటించి రోగులు నయం చేసుకునే దిశగా ముందుకెళ్లాలని చెప్పారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన రోగులందరికీ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ఇతర వైద్యశాఖ అధికారులు సాయినాథ్‌రెడ్డి, ఇతర అధికారులు, ఆశా వర్కర్లు, రోగులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తుల ప్రలోభానికి గురి కావొద్దు

■జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రజని



సదస్సులో మాట్లాడుతున్న డిఎల్ఎస్ఏ సెక్రటరీ వి.రజని

**వనపర్తి క్రైమ్, మార్చి 11 ప్రభాతవార్త :** అత్యాశకు వెళ్లి సైబర్ నేరస్తుల ప్రలోభానికి గురి కావద్దని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు అర్జించాలనే మన అత్యాశను సైబర్ నేరగాళ్లు లాభాలుగా మార్చుకుంటారని అపరిచిత వెబ్‌సైట్లో లాగిన్ అయ్యి బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను పోగొట్టుకోవద్దు చైన్ సిస్టం వంటి స్కాంలో మోసపోవద్దు అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి. రజని అన్నారు. మంగళవారంవనపర్తిలోని ప్రధానమంత్రి కౌశల్ యోజన కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్న విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. జిల్లా న్యాయ సేవ సంస్థ పనితీరు గురించి ఏ విధముగా సంస్థ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలలో, విద్యార్థులలో చట్టాలపై అవగాహన కల్పిస్తుందో తెలియజేశారు. కార్యక్రమము ముఖ్య ఉద్దేశమైన చట్టాలను వివరించడంలో భాగంగా బాల్యవివాహాల చట్టం పోక్సో యాక్ట్, మోటార్ వెహికల్ యాక్ట్, బాల కార్మికుల చట్టం గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో కేంద్రం మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## 3 గ్రామాల అభివృద్ధికి 1కోటి 3లక్షలు మంజూరు

**మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సహకారంతో**

**రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నిధుల మంజూరుకు కృషి**

**గ్రామాలలో కొనసాగుతున్న సిసి రోడ్ల పనులు**



మునగాలలో సిసి రోడ్డు నిర్మాణాలను కొలతలు చేస్తున్న పంచాయతీరాజ్ ఏఈ

**ఇటిక్యాల మార్చి11 ప్రభాతవార్త:** గ్రామాలలో సిసి రోడ్లు పూర్తిస్థాయిలోలేక ప్రజలు పడుతున్న అవస్థలను తొలగించేందుకుగాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలోని మునగాల, నక్కలపల్లి, ఇటిక్యాల మండల కేంద్రానికి రూ. 1 కోటి 3 లక్షలతో సీసీ రోడ్ల ను చేపట్టేందుకు మంజూరు అయినట్లు కాంగ్రెస్ ముఖ్య నాయకులు కొప్పుల ప్రభాకర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ దృష్టికి గ్రామాలలో అభివృద్ధి పనులకు సీసీ రోడ్లను మంజూరు చేయించాలని వారు దృష్టికి పై గ్రామాల కాంగ్రెస్ నాయకులు తీసుకువెళ్లారు. అంతేకాక గత ఏడాది నవంబర్ 26వ తేదీ ప్రజా పాలన విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అలాగే మండల కేంద్రంలో పలు కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సృజన హాజరయ్యారు. ఈ సందర్భంగా మునగాల, నక్కలపల్లి, ఇటిక్యాల గ్రామాల కాంగ్రెస్ నాయకులు ప్రజలు గ్రామాలలో సిసి రోడ్లు లెక్కల్లో ఇబ్బందులు ఉన్నాయని సిసి రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు నిదులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్‌కమిషనర్ సృజనకు వినతి పత్రం ఇచ్చారు. దీంతో తిధులుమంజూరు చేయించడంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సహకారంతో పంచాయతీరాజ్ కమిషనర్ సృజన ఆదేశాలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 3 గ్రామాలకు రూ.1కోటి 3 లక్షల నిధులు మంజూరు అయినట్లు అందుకు పంచాయతీరాజ్ కమిషనర్. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్‌కు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొప్పుల ప్రభాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, శాంతన్న తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంజూరైన నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని మునగాల ఆర్అండ్‌బి రోడ్డు నుండి దర్గా వరకు రూ. 30 లక్షల సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అలాగే నక్కలపల్లిలో రూ. 28 లక్షల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని మునగాల. ఇటిక్యాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మరో వారం రోజుల్లోగా పనులు పూర్తవుతాయని వారు ప్రభాతవార్తకు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మునగాలకు రూ. 50 లక్షలు, నక్కలపల్లికి 25 లక్షలు, ఇటిక్యాల మండల కేంద్రానికి రూ.28లక్షల చొప్పున గ్రామాలకు సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో గత వారం రోజులుగా గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గ్రామాలలో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీరాజ్ ఇన్చార్జి ఎఈ భరత్ కుమార్ రెడ్డి మునగాల గ్రామంలో వేసిన సిసి రోడ్లను కొలతలు చేశారు. నిబంధనల ప్రకారం సిసి రోడ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అలాగే 20 రోజులపాటు సిసి రోడ్లకు నీటితో క్యూరింగ్ చేపట్టాలని ఇన్చార్జి ఏఈ భరత్ కుమార్ రెడ్డి గుత్తేదారులకు సూచించారు.

## బండారి లక్ష్మణ్‌కు ఘన నివాళి



బండారి లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్, మార్చి 11 ప్రభాతవార్త:** తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు, ఖిల్లాగణపురం మాజీ సర్పంచ్ బండారి లక్ష్మణ్ చిత్రపటానికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సి.లక్ష్మారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బండారి లక్ష్మణ్ ఇటీవలే మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పెనుగొండలో బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. శాంతి కుమార్‌ను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులుసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, నాగిరెడ్డి, పిట్టల మురళి, శ్రీకాంత్, సింగిల్ విండోచైర్మన్ పాలెం సుదర్శన్‌గౌడ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తదితరులు ఉన్నారు.

## శ్రీరంగాపూర్ గౌడ సంఘం అధ్యక్షునిగా అల్వాల నర్సన్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

**శ్రీరంగాపూర్, మార్చి 11 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలం గౌడ సంఘం కమిటీ సభ్యులు అందరూ మంగళవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ సమావేశంలో శ్రీరంగాపూర్ గౌడ సంఘం సభ్యులు గతంలో ఉన్నకమిటీని తిరిగి ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా అల్వాల నరసన్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా నీరుగంటి వెంకటేష్ గౌడ్ ఉపాధ్యక్షుడిగా, మధుమోహన్ గౌడ్, నీరుగంటి బాలగౌడ్ ప్రధాన కార్యదర్శిగా, ఎస్.రామన్ గౌడ్ వెంకటాపూర్, కోశాధికారిగా సన్నెం మేఘనాథ్ గౌడు కార్యవర్గం సభ్యుడుగా రామన్‌గౌడ్ నగరాల, పి.రాజగౌడ్ తాటిపాముల, నరేందర్ గౌడ్ నగరాల, బి.రామన్ గౌడ్ సేరిపల్లి, ఎస్.ఎల్లయ్య గౌడు,వెంకటాపూర్, ఎస్. ప్రభాకర్ గౌడ్, వెంకటాపూర్, నిరంజన్ గౌడ్ నగరాల వనపర్తి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శ్రీనివాస్ గౌడ్, వనపర్తి జిల్లా యూత్ ప్రచార కమిటీ కార్యదర్శి ఎస్.దామోదర్ గౌడ్, ఎస్. మహేష్ గౌడ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయండి

టీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు దత్తెందర్, బిజి రామాంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న దతేందర్, చిత్రంలో రామాంజనేయులు

**మహబూబ్‌నగర్, మార్చి11 ప్రభాతవార్త:** టీయూడబ్ల్యూజ(ఐజేయు)మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దండు దతేందర్, జి.రామాంజనేయులు కోరారు. మహబూబ్‌గర్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నూతన సభ్యత్వాల నమోదు, జిల్లా మహాసభల నిర్వహణపై చర్చించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి జిల్లా కేంద్రంలోని ప్రింట్అండ్ ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫర్లు బ్యూరోలు ,ఫోటో అండ్ వీడియో జర్నలిస్టులు అందరూ హాజరై తమ విలువైన సూచనలుసలహాలు అందించి యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు పేట వెంకటయ్య, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మామిళ్ళపల్లి బ్రహ్మోత్సవాలకు ఉచిత బస్సు సౌకర్యం

**ఉప్పునుంతల ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లుఆలయ కమిటీ చైర్మన్‌వేముల నర్సింహారావు తెలిపారు. అచ్చంపేట నుంచి మామిళ్ళపల్లి దేవస్థానం వరకు ఉదయం 6 గ.టల నుంచి సాయంత్రం 6 గం.ల వరకు ఈ బస్సు సౌకర్యం ఉంటుందని వారు వెల్లడించారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఈప్రాంత వాసులందరూ సద్వినియోగపరచుకోవాలని, లక్ష్మీనరసింహస్వామిఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**బిజినేపల్లి, మార్చి 11 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామానికి చెందిన జంగం రవి అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. గ్రామ యువకులు శెట్టి రాజేష్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి ప్రకటించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సహాయం అందించి గుండె ధైర్యం కలిగించారు. భవిష్యత్తులో సైతం కుటుంబానికి తమ వంతుగా అండగా నిలుసామనిభరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో శ్రీరంగాపురం శ్రీనివాసులు, కారుకొండ వెంకటేష్, నిరంజన్ ఉన్నారు.

## పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ సర్వే పరిశీలన

**బిజినేపల్లి, మార్చి 11 ప్రభాతవార్త:** కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ సర్వే స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్, సిఆర్‌పి పరిశీలించారు. పాఠశాలలో గత రెండు రోజుల నుండి రెండో తరగతి విద్యార్థులను ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి అభ్యసన సామర్థ్యాల పరిశీలన సర్వే చేస్తున్న ఇన్వెస్టిగేటర్ సుమలత సర్వేను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో విద్యార్థులకు రిపోర్టును అప్లోడ్ చేస్తున్న విషయాన్ని ఇన్వెస్టిగేటర్‌ను అడిగి తెలుసుకుని తగు సూచనలు సలహాలు ఇచ్చారు. పాలెం స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సయ్యద్ మొయినుద్దీన్,సీఆర్పి మల్లేష్, హెడ్మాస్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

## ఛలో పిఠాపురం ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ

**వనపర్తి క్రైమ్, మార్చి 11 ప్రభాతవార్త:** జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని పిఠాపురంలో మార్చి 14 తేదీన జరగనున్న సభను పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా నాయకుల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ ఛలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణచేపట్టినట్టు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు, వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు తెలిపారు. ఛలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నాయకులు రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ఎండి మహబూబ్,ఉమ్మడి జిల్లా యూత్ ప్రెసిడెంట్ సాంబశివుడు వివిధ నియోజకవర్గల నాయకుల సమక్షంలో ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొనేలా పోస్టర్స్ ఆవిష్కరణ చేపట్టినట్టు ముకుంద నాయుడు పేర్కొన్నారు. జనసేన అధినేత ప్రభుత్వంలో అధికారం చేపట్టి ఏపీ ఉపముఖ్యమంత్రిగా తొలిసారి జరుగుతున్న పార్టీ ఆవిర్భావ సభకు వెళ్ళడం జన సైనికులకు విజయోత్సవ ఆనంద వేడుకని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల నాయకులు మణికంఠ, హనుమంతు, ఉత్తేజ్, సురేష్ , ప్రకాష్, రాములు, రాజేందర్, సాయి, శ్యామ్,శరత్, రామకృష్ణ, రామన్ గౌడ్, నంద నాయుడు, బత్తిని బాలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**నవాబుపేట, మార్చి 11 ప్రభాతవార్త:** విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణ పనులువేగవంతం చేయాలని ఎంపీడీవో జయరాం నాయక్ తెలిపారు. మండల పరిధిలోని కారుకొండ గ్రామ మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం మండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్ పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించిన ఆయన విద్యార్థులకు వసతుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. స్కూల్‌ప్రధానోపాధ్యాయులు,అధికారులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**నవాబుపేట,మార్చి11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో మంగళవారం విజయ కార్డియాక్ హాస్పిటల్ షాద్‌నగర్ వారు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నవాబుపేట సబ్ ఇన్స్‌పెక్టర్ ఎం.విక్రమ్ ప్రారంభించారు. పుట్టిన గ్రామంలో ఉచిత సేవా కార్యక్రమం నిర్వహించాలని ఒక డాక్టర్‌గా డా. విజయ చందులాల్ రాథోడ్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు ఉచిత మందులు పంపిణీ చేయడం ఎంతో మంచిదని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.విక్రమ్ అన్నారు. ఉచితంగా ఈసీజీ, జిఆర్బి ఎస్,బిపి,జనరల్ చెకప్,గుండెకు సంబంధించిన పరీక్షలు,చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేయడం జరిగిందని డా. విజయ చందులాల్ రాథోడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు విజయలక్ష్మి రాథోడ్,రమాకాంత్ నాయుడు, శ్వేత, చైతన్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విస్లావత్ తులసి రామ్ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్లావత్ చందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ ఖాజామైనోద్దీన్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**శ్రీరంగాపూర్, మార్చి 11 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులై బోధన చేశారు. ప్రథమ ఉపాధ్యాయురాలిగా ఏ. కీర్తన, జిల్లా విద్యాధికారిగా ఎస్. శ్రీకాంత్, మండల విద్యాధికారిగా జి. నవ్యశ్రీ, వ్యవహరించారు. మొత్తం20 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాలు అత్యుత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి ఎం.కీర్తన,ద్వితీయ బహుమతి ఎస్.రిషిత, తృతీయబహుమతి సి.అంజలి అందుకున్నారు. మిగతా ఉపాధ్యాయులకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమానికి శ్రీరంగాపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులుజి.విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రవీందర్ రెడ్డి. ఉపాధ్యాయులు మోహన్ రాజు. వసంతపురం రాజు .దామోదర్ బాబు, చిన్నస్వామి,సమ్రిన్ బేగం,బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయురాలు తస్లీం బేగం, ప్రీ ప్రైమరీ సిబ్బంది ప్రకృతమ్మ, రత్నమాల పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**శ్రీరంగాపూర్, మార్చి11 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని యుపిఎస్ జానంపేట పాఠశాల విద్యార్థులకు మహేష్ నాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మరియు అంగన్వాడి కేంద్రం పిల్లలకు పలకలు, నోట్ బుక్స్, పెన్సిల్స్, రబ్బర్స్, లేజర్స్ అందించడం జరిగింది. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకొని ముందుకు పోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని జానంపేట మిత్ర బృందం ఎండి ఇమ్రాన్, బాలు, శివసాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అటెండర్ ఖయ్యూం అంగన్వాడి టీచర్ సరళ,నాగమణి, హెల్పర్స్ సావిత్రి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలించిన కలెక్టర్

**ధన్వాడ, మార్చి 11 ప్రభాతవార్త:** జిల్లాలోని ధన్వాడ మండలం మంది పల్లి గ్రామానికి చెందిన నర్సింహులు అనే రైతు సాగు చేసిన వరి పంటను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఆ రైతు తన నాలుగు ఎకరాలలో వరి పంట వేయగా ఎకరా వరకు సాగు నీరులేక ఎండిపోయే దశకు చేరుకుంది. గతేడాది వరి సాగుకు ఎలాంటి సమస్య రాలేదని, ఈ వేసవి కాలం భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు వట్టిపోతున్నాయని, వరి పంట ఎండిపోతుందని రైతు నరసింహులు కలెక్టర్‌తో ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఎక్కడెక్కడ ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శ్రీధర్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఏఈఓ రైతులు పాల్గొన్నారు.

# నేటి యువతతోనే రేపటి దేశ ప్రగతి

◆ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ◆ ఉల్లాసంగా యువ ఉత్సవ్ కార్యక్రమం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 11 ప్రభాతవార్త:** కేంద్ర యువజన క్రీడా సర్వీస్ శాఖ, మై భారత్, నెహ్రూ యువ కేంద్ర సహకారంతో స్వామి వివేకానంద సేవ బృందం ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ హాజరయ్యారు. యువ ఉత్సవంలో భాగంగా విద్యార్థులు అనేక రంగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. విదార్థులు సైన్స్ మేళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ వికసిత్ భారత్‌లో యువత పాత్ర ముఖ్యమైనది అని అలాగే చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలిఅని కోరారు. అనంతరం ఈ నెల నిర్వహించనున్న జాతీయ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్వామివివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివకుమార్, జిల్లా యువజన అధికారి కోటా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్స్ రమాదేవి, గౌసియా, రెవిన్యూఅధికారులు, నాయకులు కళ్యాణ్‌నాయక్, కట్ట సుధాకర్, సేవ బృందం సభ్యులు లక్ష్మీనరసింహ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

■ మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి, చిత్రంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి11 ప్రభాతవార్త;** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు అన్ని విధాల మేలు జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్‌రెడ్డితో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్,సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మలకుంట తండా, రేగడి పట్టితండా, చిన్నగుట్ట తండా, శామగడ్డ తండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రం లో ఇండ్లు, కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవస రాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు,అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, పార్కులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్ల త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు కొందరు అడ్డుపడుతున్నారని, భూమి కోల్పోయిన వారి అపోహలు, భయాన్ని కలుగచేస్తున్నట్లు, ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. ఉదండా పూర్ రిజర్వాయర్‌లో భూమి కోల్పోయిన వారికి ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం అందేలా చూడాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినట్లు, ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. ఉదండపూర్ రిజర్వాయర్ అర్‌ఆర్‌విషయంలో ఏమైనా సమస్యలు వుంటే ఆర్డీవో దృష్టికి తీసుకు రావాలని ఆయనఅన్నారు. ఈ సమావేశంలోస్పెషల్ కలెక్టర్ (ఎల్. ఎ.) మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలి

■ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మార్చి 11 ప్రభాతవార్త :** ప్రాధాన్యత రంగాలైన అగ్రికల్చర్, ఎంఎస్‌ఎంఈ లకు త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి నారాయణపేట జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన డీసీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో కన్వీనర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వార్షిక ప్రణాళిక 2024,25 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసానికి రూ. 1984.54 కోట్లతో త్రైమాసిక వృద్ధియని, వార్షిక ప్రణాళికలో 60.62 శాతం అలాగే ఎస్‌ఎంఈ సెగ్మెంట్‌కు సంబంధించి రూ. 123.06 కోట్లతో 48.80 శాతం ప్రగతి అని తెలిపారు. ప్రాధాన్యత రంగానికి రూ.1678.14 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎల్‌బిసి ఏజీఎం శ్రీహరి, ప్రకాష్, ఆర్‌బిఐ ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ డీడీ ఎం.షణ్ముఖ చారి,ఎస్‌బిఐ ఏజీఎం అనిల్ కుమార్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పలు సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం నాబార్డు వారిచే పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ 2025,26 గాను రూ.3,833.47 కోట్ల రుణ లక్ష్యంతో రూపొందించిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ మొత్తం 2024, 25సంవత్సరం కంటే 25.23 శాతం అధికం కాగా, వ్యవసాయ రంగానికి రూ.3470.93 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.310.30 కోట్ల లక్ష్యాన్ని నిర్ధారించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైని కలెక్టర్ గరిమా నరుల పాల్గొన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

■ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, మార్చి 11 ప్రభాతవార్త:** మానవ హక్కుల పరిరక్షణ అంటే ప్రజలకు రాజ్యాంగం చట్టం ద్వారా కల్పించిన హక్కులను కాపాడటం అని,మానవ హక్కులు అనేవి జాతి, లింగం, మతం, భాష జాతీయత వంటి వాటితో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికి జన్మత సంక్రమించే హక్కులుగా భావించాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం రోజు జిల్లా కేంద్రంలోని తరుణి ఫంక్షన్ హాల్లో మానవ హక్కుల పరిరక్షణ బాధ్యతలకు గురించి అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం భారతదేశంలో జాతీయ మానవ హక్కుల కమీషన్ ఉందని ఆయనతెలియజేసారు. మానవ హక్కుల పరిరక్షణకు చట్టాలు రూపొందించడం జరిగిందని, మానవ హక్కుల పరిరక్షణ బిల్లు 2019లో ప్రభుత్వం తీసుకు వచ్చిందని తెలుపారు. బానిసత్వం హింస నుండి స్వేచ్ఛ, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ, పని, విద్యహక్కులు, సమానత్వం న్యాయం కోసం పోరాటం చేయడమే మానవ హక్కుల పరిరక్షణగా భావించాలని ఆయన తెలియజేసారు. నేడు విద్యాలయాలుఅంటే చదవడం రాయడం నేర్పేస్థలంగా అనుకుంటున్నాం. సమగ్ర అనుభవానికి సంబంధించిన విషయాలను నైపుణ్యాలను నేర్పేదే విద్యాలయాలుగా భావించాలని విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సమాజ పరిణామాలను గ్రహించాలని మానవ హక్కులను బాధ్యతలను తెలుసుకొవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఇంచార్జ్ కొమ్ము అగిరప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోచయ్య,రాష్ట్ర కార్యదర్శి జిటి శ్యామ్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు సి. విశ్వబాబు, ఉపాధ్యక్షుడు జి.ఆంజనేయులు,జిల్లా ప్రధాన కార్యదర్శి శైలన్ కుమార్, ప్రెస్ సెక్రటరీ జి.శివ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ గౌడ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కొట్ర బాలు, సామాజిక కార్యకర్త గంధం నాగరాజు, ఆర్డీఎస్ ఎన్జీవో నిర్వాహకులు చిన్నమ్మ థామస్, సఖి కేంద్ర నిర్వాహకులు కవిత, జిల్లా జెండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమి , చిత్రకారుడు జి.టి.కృష్ణ విద్యార్థులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**కల్వకుర్తి, మార్చి 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన జాగృతి జిల్లా అధ్యక్షురాలు మిర్యాల పావని అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో మృతురాలి నివాసం వద్దకు చేరుకొని మృతురాలి భర్త మిర్యాల పాండురెడ్డి, అతని సోదరుడు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బృంగి ఆనంద్ కుమార్, రాములు, శ్రీనివాసులు, దామోదర్‌గౌడ్,రాకేష్‌శర్మ వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మమ్మల్ని ఆశీర్వదించండి

◆ మరింత సేవ చేసే అవకాశం కల్పించండి
◆ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందజేస్తాం
◆ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి11 ప్రభాతవార్త:** ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో ఎస్సి సబ్ ప్లాన్ కింద కోడూరు గ్రామంలో రూ. 40 లక్షల అప్పాయిపల్లి గ్రామంలో 10 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇతర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు త్వరలో వస్తాయని అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని అందుకే గృహజ్యోతి పథకం కింద 200యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం తో పాటుగా భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తున్నామని, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని ఆయన గుర్తు చేశారు.మీరంతా మమ్మల్ని ఆశీర్వాదించాలని, మీకు మరింత సేవ చేసుకొనే అవకాశం మాకు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, రామచంద్రయ్య, పోతన్ పల్లి మోహన్ రెడ్డి,అనుపటి ఆంజనేయులు,ఆంజనేయులు,రవి, శ్రీనివాస్ రెడ్డి, రామస్వామి,ప్రసాద్ ముదిరాజ్, పవన్ కళ్యాణ్, రాము, రవీందర్ ముదిరాజ్, కురుమయ్య, చందు, శేఖర్, అర్జున్, ఎంపిడిఓ కరుణశ్రీ పాల్గొన్నారు.

# యువ శక్తి నిర్వీర్యం కావద్దు

- ఉపాధి అవకాశాలు కల్పించేందుకే జాబ్ మేళా
- అర్హత ఉన్న ప్రతి యువకునికి ఉపాధిని కల్పించేందుకు కృషి
- టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



జాబ్ మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మార్చి 11 ప్రభాతవార్త:** ప్రపంచ దేశాల్లో ఎక్కడ లేని విధంగా భారతదేశంలో యువశక్తి మెండుగా ఉందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సింగిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గత పాలకులు యువశక్తిని నిర్వీర్యం చేశారని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కల్వకుర్తి ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి యువకునికి ఉపాధి అవకాశాలుకల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందనిఆయన అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనునట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 25న కల్వకుర్తి పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, ఇందులో 50 కంపెనీలు పాల్గొంటాయని,5000 మంది వరకు నిరుద్యోగులు ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. 18 సం॥లు వయస్సు నిండి శారీరక దృఢత్వంతో 60 సంవత్సరాల పైబడిన వయస్సు గల వారు కూడా జాబ్ మేళాను వినియోగించుకోవచ్చని సూచించారు. అర్హత అనుభవం ఉన్నప్రతి యువకునికి తనకి తగ్గ ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని, వారి చదువును బట్టి వివిధ రంగాలలో ఉద్యోగం పొందవచ్చునని, చదువుకున్నవారు చదువురాని వారు కూడా వారి వారి అర్హతను బట్టి ఉద్యోగం పొందవచ్చునని అన్నారు. నిరుద్యో గులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్‌ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండే షన్ సభ్యులు, నాగర్‌కర్నూలు జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాపోతూ అనిల్ కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై దాడులను ఆపడంలో ప్రభుత్వాలు విఫలం

**అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత**



మాట్లాడుతున్న మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత

**నారాయణపేట టౌన్, మార్చి 11 ప్రభాతవార్త :** మహిళలపై జరుగుతున్న దాడులను ఆపడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండగీత విమర్శించారు.మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో ఆమె ముఖ్యవక్తంగా హాజరై మాట్లాడుతూ మహిళలపై హింస, దాడులు,అత్యాచారాలు ,హత్యలు పెరిగిపోతున్నాయని నేరస్తులకు కఠిన శిక్షలువేయడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో సహకరించడం లేదని విమర్శించారు. మణిపూర్‌లో మహిళను వివస్త్రను చేసి రోడ్డుపై ఊరేగించారని సామూహిక అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించడం లేదని విమర్శించారు. బాలికలకు ఉచిత విద్యా ఉచిత ఉచిత వైద్యం అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అంగన్వాడీ, ఆశా, ఉపాధి కూలీ తదితర శ్రామిక మహిళలకు శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదని విమర్శించారు. మహిళా సాధికారత సమానత్వం అందించాలని డిమాండ్ చేశారు. పురుషుడితో సమానంగా మహిళను ఎదిగేందుకు ఈ సమాజం, ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. మహిళను తక్కువ చేసి చూసే వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మహిళ ఒంటరిగా తన పని తాను చేసుకుని క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకొని పరిస్థితులు ఇంకా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు మహిళా సంఘం జిల్లా నాయకురాలు సమీనా అధ్యక్షత వహించారు. మహిళా సంఘం నేతలు గుండెగారి రాజేశ్వరి, బాలమణి, అమృతమ్మ, ప్రజా సంఘాల నాయకులు వెంకట్రామిరెడ్డి,గోపాల్, బాల్ రాం, అంజిలయ్య గౌడ్, చంద్ర శేఖర్, కాశప్ప, నరహరి, పవన్, తదితరులు మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో మహిళా సంఘం నాయకులు దానమ్మ, లలితమ్మ, కృష్ణవేణి, కవిత, ఆశమ్మ పాల్గొన్నారు.

## ప్లాట్ల యజమానులకు అవగాహన కల్పించాలి

◆ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 11 ప్రభాతవార్త :** ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యజమానులకు క్రమబద్ధీకరణ రుసుం చెల్లించి అనధికార లే అవుట్ క్రమబద్ధీకరణ చేసుకునేలా వారికి అవగాహన కలిగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్, శివేంద్ర ప్రతాప్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంను మంగళ వారం ఆయన సందర్శించారు. ఎల్అర్‌ఎస్ దరఖాస్తు దారులు ఈ నెల 31 లోగా రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. మెప్మా ఆర్‌పిలు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తు దారులకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మహిళపై దాడి : కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాఘణపురం, మార్చి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన పంతగాని లక్ష్మి తన తండ్రి విరిజన గాని బాలయ్య ఇంటి స్థలంలో చిన్న కిరాణాదుకాణాన్ని ఏర్పాటు చేసినవిషయంలో ఆమె బంధువులు మంగళ వారం విరిజన గాని రాములు, విరిజన గాని మహేష్ ,కిరాణాన్ని ధ్వంసం చేశారు.అట్లాగే లక్ష్మిని అసభ్యంగా దూషించి దాడి చేసి కొట్టారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు

## ఘనంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం



**నారాయణపేట టౌన్, మార్చి 11 ప్రభాతవార్త :** భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి గ్రామంలో బికేఎస్ మండలనాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘం జెండాను ఆవిష్క రించారు. అనంతరం బికేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శరణయ్య స్వామి మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ రైతులకు అండగా ఉంటూ సమస్యల పరి ష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తుందన్నారు. 69 జీవోతో ఈ ప్రాంత రూపు రేఖలు మారుతాయి అన్నారు. అందరి సహకారంతోనే 69 జీవో అమలు అయ్యిందన్నారు. రాజకీయాలు వేరైనా రైతులంతమంతా ఒకటే అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వెంకట్రాములు, శేఖర్, బుచ్చయ్య, లాలప్పతో బాటు తదితరులు ఉన్నారు.

## ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలి

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోనిపాటి కళ్యాణ్ మాదిగ**



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**నారాయణపేట టౌన్, మార్చి11 ప్రభాతవార్త :** ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్ 1, 2, 3 హెచ్‌డబ్ల్యు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జాబ్స్ ఫలితాల విడుదల చేస్తామని టిజిఎస్‌పిఎస్‌సి ప్రకటించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ పార్క్ వద్ద రిలే నిరసన దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గోనిపాటి కళ్యాణ్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ పైన ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేస్తూ మాదిగలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన రోజుముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని అవసరమైతే ఇది వరకు ఇచ్చిన నియామకాల ఫలితాల్లో వర్గీకరణ అమలు చేస్తామని ప్రత్యేకమైన ఆర్డినెన్సు తీసుకు వచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని చెప్పి ఇప్పుడు వర్గీకరణ అమలు చేయకుండా గ్రూప్ 1,2,3 హెచ్‌డబ్ల్యుఓ,ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జాబ్స్ ఫలితాల విడుదలచెయ్యటం మాదిగలను మోసం చెయ్యటమేనని తెలిపారు. వర్గీకరణ బిల్లు ఇప్పుడు ఈ నోటిఫికేషన్లలో అమలుచేయించుకోకపోతే మాదిగలు ఉపకులాలు తీవ్ర స్థాయిలో నష్టపోతారని మాదిగలు మేల్కొని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడానికి మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుకి కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్ మాదిగ, తిరుమలేష్ మాదిగ, అశోక్ మాదిగ, చెన్నప్ప మాదిగ, రంగప్ప మాదిగ, కిష్టప్ప మాదిగ,తిమప్పమాదిగ, మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**చిన్న చింతకుంట,మార్చి11 ప్రభాతవార్త:** మండలంలోని లక్ష్మిదేవిపూర్ గ్రామానికి చెందిన పల్లెపాగు ఆనందం (50) ఈనెల 7న మధ్యాహ్న సమయంలో తన గ్రామం నుండి కూరగాయల కొనుగోలుకై తన ద్విచక్ర వాహనం టీవీఎస్ ఎక్సెల్‌పై మండల కేంద్రానికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేసుకుని తిరిగి వెళుతుండగా మార్గ మధ్యలోతన ద్విచక్ర వాహనంఅదుపుతప్పి కింద పడటంతో గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యంకై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడని ఎస్సై రామ్‌లాల్ నాయక్ తెలిపారు. మృతునికి వరసకు తమ్ముడగు సంధ్యపాగు శాలివాహన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయురాలకు ఘనంగా సన్మానం

**లింగాల, మార్చి 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో పిఆర్టీయు మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా ఎస్జీటీ ఉపాధ్యాయురాళ్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్జీటీ మహిళా ఉపాధ్యాయురాళ్లను శాలువాతో సత్కరించినట్లు మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ తెలిపారు. అనంతరం బషీర్ అహ్మద్ మాట్లాడుతూ మహిళలుఅన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమని మండల విద్యాధికారి బషిర్ అహ్మద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పురుషోత్తం, మండల అధ్యక్షులు పాండుగౌడ్ ,మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పాల్గొన్నారు.

## 13న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**చిన్న చింతకుంట, మార్చి11 ప్రభాతవార్త :** గ్రామీణ క్రీడ అయినా కబడ్డీ పోటీల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకు మండలంలోని కురుమూర్తి గ్రామంలో ఈనెల 13న మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి స్మారకార్థం, వీర హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్ల నిర్వాహకులు భాస్కర్‌గౌడ్, రాజు నాయుడు, అంజిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను గురువారం ఒక్కరోజు మాత్రమే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, నాలుగవ బహుమతి రూ.3 వేలతోపాటు షీల్డ్‌లను అందజేయనున్నట్లు వారు తెలిపారు.పూర్తి వివరాలకై ఫోన్ నెంబర్ 9603354369,9182871213,9000249470 లకు సంప్రదించాలని వారు తెలిపారు. ఈ క్రీడా పోటీలలో నిబంధనలు వర్తిస్తాయని వారు తెలిపారు. ఆసక్తి ఉన్న కబడ్డీ క్రీడాకారులు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు.

## రేపు మక్తల్‌లో టెన్నికాయిట్ పోటీలు

**మక్తల్, మార్చి 11 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న మక్తల్ పట్టణంలో జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప, నిర్వహణ కార్యదర్శి ఎస్.రమేష్ కుమార్ తెలిపారు. మక్తల్ పట్టణంలోని సాయి జ్యోతి ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించే ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 15 నుంచి 16 వరకు హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకుఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సీనియర్ పురుషులు, మహిళల విభాగంలో నిర్వహించే ఈ పోటీలకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో విశ్రాంత పీఈటీ బి.గోపాలం, పిఈటిలు అమ్రేష్, దామోదర్ పాల్గొన్నారు.

## పంటలు ఎందుకు ఎండుతున్నాయి..

(మొదటి పేజీ తరువాయి)

బోధన గురించి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కెజిబివిలో చిన్న చిన్నరిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎంపిడిఓ హరిచంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

## కచ్చా లే అవుట్ ప్లాట్‌లను కొనుగోలు చేయవద్దు

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఎల్ఆర్ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు.భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్ఆర్ఎస్ ఉన్న ప్లాటుకు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు. ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టిన ప్లాటు యజమానులకు కలెక్టర్ క్రమబద్ధీకరణ ఉత్తర్వు కాపీలను అందజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, లైసెన్స్ లేఔట్ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు అత్యంత నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. నేర్చుకున్న అంశాలను మీరు మాత్రమే కాకుండా ఇతర మేస్త్రీలకు కూడా తెలియజేయాలనీ అన్నారు. అధిక నాణ్యతతో ఇళ్లను నిర్మించేందుకు సహకరించాలని సూచించారు. అనంతరం మేస్త్రీలకు నిర్మాణానికి అవసరమైన టీషర్ట్స్, కిట్‌లను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వహించాలని మేస్త్రీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాస్కర్, డి.ఈ నరేందర్, ఎ.ఈ ప్రకాష్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అధికారి శివ శంకర్, మేస్త్రీలు పాల్గొన్నారు.

**బహిరంగ హెచ్చరిక**

ఇందు మూలంగా సమస్త ప్రజలకు తెలియచేయడం ఏమనగా నా క్లయింటు శ్రీమతి. చుక్క అనిత W/o చుక్క సతీష్ R/o వనపర్తి పట్టణం మరియు జిల్లా గారు, తన మైనర్ కూతుర్లయిన కుమారి. జాహ్నవి వ: 16 సం. లు, కుమారి. నవ్య, వ: 13సం. లకు వనపర్తి పట్టణంలోని స.నెం. 91/3 వి: ఎ: 0:105 గుం.లు, స.నెం.196ఇ వి: ఎ:2:02 గుం.లు స.నెం.197/3 వి:ఎ:2:28 గుం.లు, స.నెం.68/4 వి: ఎ: 0:02 గుం.లు, స.నెం.69ఇ వి: ఎ: 0:24 గుం.లు నందలి భూమి వారసత్వ భూమి కాగా, వారి తండ్రి, తాతలు వారి హక్కులను కాలరాసే విధంగా, పై భూమిని ప్లాట్లుగా మార్చి అన్యాక్రాంతం చేయ ప్రయత్నిస్తున్నారని తెలిసినది.అటువంటి క్రయ విక్రయాలు చట్టపరంగా చెల్లవు. నా క్లయింట్ మైనర్ కూతుర్లకు సదరు భూమి పై హక్కు ఉన్నందున, వారికి తెలియకుండా, ఎటువంటి క్రయ విక్రయాలు జరిపినా మా క్లయింట్ తీసుకొను తదుపరి చట్ట పరమైన చర్యలకు భాద్యులు కాగలరు అని బహిరంగంగా హెచ్చరించనైనది.

**K. శశి భూషణ్** న్యాయవాది, వనపర్తి.
సెల్ నెం. 9603943973